# కాంగ్రెస్ నాయకుల గ్రూప్ వార్

- స్థానిక ప్రజా ప్రతినిధులు లేకుండానే శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- ఎమ్మెల్యే వ్యతిరేక-అనుకూల వర్గం మధ్య పోరు
- అంతా అధికారుల ఇష్టారాజ్యం అంటూ కలెక్టర్‌కు మేయర్, డిప్యూటీ మేయర్ ఫిర్యాదు

బండ్లగూడ, జూలై 25: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఏమోగానీ, ఆయనకు కొత్త తలనొప్పులు వస్తున్నాయి. పార్టీలో కొత్త, పాత నాయకుల మధ్య గ్రూప్ వార్ మొదలైంది. ఎమ్మెల్యే వ్యతిరేక, అనుకూల వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. గతంలో ఎమ్మెల్యేతో కలిసి ఉన్నవారే ఇప్పుడు తిరుగుబాటు చేస్తున్నారు. గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఉన్నట్లు కమిషనర్ శరత్‌చంద్ర మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిలతో పాటు కార్పొరేటర్లు, మీడియా ప్రతినిధులకు సమాచారమిచ్చారు. ఉదయం కార్పొరేషన్ కార్యాలయానికి కార్పొరేటర్లతో మేయర్ విచ్చేసి అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే కమిషనర్ సమావేశం తర్వాత ప్రారంభోత్సవాలు చేద్దాం అని చెప్పారని, అనంతరం సమావేశం లేదని బుధవారం రాత్రి ఆలస్యంగా తెలిపినట్లు మేయర్ వాపోయారు. మేయర్‌గా తాను కార్పొరేటర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తే.. ఎలా రద్దు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ మాటకు విలువ లేకుండా కమిషనర్ వ్యవరిస్తున్నాడని మేయర్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండానే పనులకు శంకుస్థాపనలు చేశారు.


చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మేయర్ లత, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు


కార్పొరేటర్ లేకుండానే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మేయర్, డిప్యూటీ మేయర్

కార్పొరేషన్ పరిధిలో ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి తమ ఇష్టానుసారంగా అధికారులు వ్యవరిస్తున్నరని మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఇష్టానుసారంగా వ్యవరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ఇప్పటికే శంకుస్థాపనలు చేశాం: కార్పొరేటర్లు

అభివృద్ధి పనులకు వివిధ డివిజన్లలో కార్పొరేటర్లు ఇదివరకే శంకుస్థాపనలు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో.. తిరిగి శంకుస్థాపన చేయడం ఏమిటని పలువురు కార్పొరేటర్లు అధికారులను ప్రశ్నించారు. అధికారుల ధోరణిపై ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారిందని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 25: ఓయూ పరిధిలోని పలు కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫీజును ఆగస్ట్ 2లోగా ఆయా కళాశాలల్లో చెల్లించాలన్నారు. రెండేళ్ల ఎంసీఏ (సీబీసీఎస్) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫీజును ఆగస్ట్ 6లోగా కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపా రు. వివరాలకు వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చున్నారు.

### దూరవిద్య పీజీ కోర్సుల పరీక్ష తేదీల మార్పు

ఓయూ దూరవిద్యా కేంద్రం ప్రొ.జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే పీజీ కోర్సుల పరీక్ష తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ మొదటి, రెండో ఏడాది పరీక్షలను ఆగస్టు 13 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

### రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంసీఏ పరీక్ష ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, విద్యార్థులు మెమోలను మూడు వారాల తరువాత కళాశాలల్లో తీసుకోవాలన్నారు. ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈనెల 26గా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో ఆగస్ట్ 5వరకు చేసుకోవచ్చున్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 2 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## నిషేధిత సైలెన్సర్లు బిగిస్తే కఠిన చర్యలు

**రాజేంద్రనగర్ ఏసీపీ బాలాజీ**

బండ్లగూడ, జూలై 25: నిషేధించిన సైలెన్సర్లను బైకులకు బిగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో నిషేధించిన సైలెన్సర్లు ఉన్న బైకులపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఇందులో పట్టుబట్ట వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ.. నిషేధించిన సైలెన్సర్లతో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తిరిగి వాటిని అమరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఐ నరసింహ తదితరులు పాల్గొన్నారు.


సైలెన్సర్లు తొలగించిన బైకులతో ట్రాఫిక్ పోలీసులు

## నాటిన ప్రతి మొక్కను కాపాడాలి



శంషాబాద్ రూరల్, జూలై 25: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ పేర్కొన్నారు. గురువారం శంషాబాద్ మండలం పాలమాకుల ఆదర్శ పాఠశాల ఆవరణలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో 1200 మొక్కలు నాటారు. ఐటీ ఉద్యోగులు మొక్కలను పంపిణీ చేశారు.. ఇందులో సపోట, వేప, మందార, గన్నేరు మొక్కలు ఉన్నాయి. వాటి సంరక్షణ కోసం పైప్‌లైన్ వేశారు. నాటిన ప్రతి మొక్కను కాపాడాలని పేర్కొన్నారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండియన్‌లో సిబ్బందిని నియమించాలి



లిబర్టీలోని ఇండియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జూలై 25: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఇండియన్ బ్యాంకు శాఖల్లో అవసరమైన సిబ్బంది, అధికారులను నియమించాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు, ఇండియన్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి పీవీ కృష్ణారావు డిమాండ్ చేశారు. క్యాజువల్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం లిబర్టీలోని ఇండియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకు శాఖలు ఒకే క్లరికల్‌తో కొనసాగుతున్నాయని మరి కొన్ని శాఖలు సిబ్బంది లేకుండానే పనిచేస్తున్నాయని తెలిపారు. అధికారులే తాళాలు పట్టుకొని నగదు కార్యకలాపాలు నిర్వహించే దుస్థితి ఏర్ప డిందన్నారు. ఉభయ రాష్ట్రాలో క్లరికల్ స్టాఫ్, సబార్డినేట్ స్టాఫ్, స్వీపర్లను భర్తీ చేసి, క్యాజువల్ ఉద్యోగులకు కనీస వేతనాలు, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎంఎస్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.నల్లప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీది స్వార్థ రాజకీయం

ఖైరతాబాద్, జూలై 25: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం దళితులను విభజించి పాలించాలని చూస్తున్నదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 8, 9, 10తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల నుంచి మాల, మాల ఉపకులాలకు చెందిన కార్యకర్తలు, అంబేద్కర్‌వాదులు, ఇతర రాష్ట్రాల నుంచి ప్రముఖ సామాజిక కార్యకర్తలు మహాధర్నాకు హాజరుకానున్నట్లు తెలిపారు. గురువారం ఖైరతాబాద్‌లోని నవీన్‌నగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ.. ఆగస్టు 8న హలో మాల.. చలో ఢిల్లీ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కార్యకర్తలు అత్యధికంగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ గోపోజు రమేశ్, మాల మహానాడు ఉపాధ్యక్షుడు రాజేశ్, మాల మహానాడు రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆనంద్‌రావు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య




## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్

మణికొండ, జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూత ఇస్తున్నట్టు మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో నెక్నాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చైర్మన్ నరేందర్ నోటు పుస్తకాలు అందజేశారు. టీచర్లు బోధించే అంశాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. కౌన్సిలర్ పురుషోత్తం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేశ్, ముత్యాలు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అహమద్ షాఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుష్ఠు రోగులకు ఏడీపీ, లెప్ర సొసైటీ తోడ్పాటు



మణికొండ, జూలై 25: సమాజ సేవలో తోడ్పాటు అందిస్తున్నామని ఏడీపీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, హెచ్‌ఆర్ హెడ్ వెంకటేశ్ అన్నారు. కుష్ఠు వ్యాధితో బాధపడుతున్న వారి శ్రేయస్సుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. గురువారం నార్సింగి ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక పాదరక్షలను విరాళంగా ఇచ్చేందుకు లెప్రా సొసైటీతో ఏడీపీ సహకారాన్ని ప్రకటించింది. ఏడీపీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, గ్లోబల్ అండ్ ఇండియా ఫైనాన్స్ ఏడీపీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సచ్చిదానంద, సీనియర్ డైరెక్టర్ హెచ్‌ఆర్ జార్జ్ మాథ్యూస్, లెప్రా సొసైటీ ప్రతినిధులు సురేశ్, కామేశ్, రమేశ్, అరుణ్‌కుమార్, డాక్టర్ సత్యరత్న, బాబురావు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బండ్లగూడ, జూలై 25: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో గురువారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.4కోట్ల 49లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, డీఈ యాదయ్య, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు సురేశ్‌గౌడ్, సుమన్‌గౌడ్, మాలా కీరత్నం, అంతారం నరేశ్, పాపయ్యయాదవ్, కృష్ణారెడ్డి, అక్కెం శ్రీనివాస్, గణేశ్, యాసిన్ అయ్యూబి, నర్సింహ్మగౌడ్, రాంప్రసాద్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, జూలై 25: రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల, బాలికలకు పౌష్టికాహార లోపం రాకుండా క్రమం తప్పకుండా విద్యార్థులకు కోడిగుడ్డును అందించాలన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, సామాజిక భద్రత, ప్రమాద బీమా రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు.

### నిర్మాణ రంగంలో సివిల్‌కు మంచి భవిష్యత్

బంజారాహిల్స్, జూలై 25: ఆధునిక నిర్మాణ రంగంలో సివిల్ ఇంజినీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందని మ్యూటెక్ ఇంజినీరింగ్ ఎండీ మహ్మద్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. భిన్న నిర్మాణ పద్ధతులతో మారుతున్న శైలిని అర్థం చేసుకునే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుదన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌తో మ్యూటెక్ ఇంజినీరింగ్ అండ్ కన్సల్టెంట్, ఎంఎన్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్ సంస్థలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఎంఎన్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ మహ్మద్ అబ్దుల్, ఎంజే సెట్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహిపాల్ సింగ్, రిజిస్ట్రార్ కేవీ నర్సింహారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కమల్ సుల్తానా, హెచ్‌ఓడీ డాక్టర్ మహ్మద్ అమ్రాజ్ పాల్గొన్నారు.

### అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

జూబ్లీహిల్స్, జూలై 25: జూబ్లీహిల్స్ డివిజన్ వినాయకనగర్‌లో ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు బోనాల వేడుకలకు రావాల్సిందిగా కమిటీ ప్రతినిధులు కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో వినాయకనగర్ నాయకులు నిరంజన్, జంగయ్య, తిరుపతి, వెంకటేశ్, రాములు, రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మా.. బైలెల్లినాదో

మణికొండ,జూలై 25: ఆషాఢ బోనాల ఉత్సవాలు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. గోల్కొండ, లష్కర్ బోనాల తర్వాత మొదటి వారంలో ఇక్కడ బోనాలను నిర్వహిస్తారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, ఖానాపూర్ గ్రామాల్లో బోనాల సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. ఖానాపూర్‌లో కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, సహకార సంఘ చైర్మన్ కృష్ణ, మాజీ ఎంపీపీ మల్లేశ్ పూజలు నిర్వహించారు. నార్సింగిలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ అధ్యక్షుడు క్యాతం అశోక్‌యాదవ్, కౌన్సిలర్లు లక్ష్మిప్రవళిక, ఉషారాణి, అరుణజ్యోతి, పత్తి ప్రవీణ్‌కుమార్, పత్తి శ్రీకాంత్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ఉత్సవాల్లో భాగంగా పోతురాజుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అద్భుతమైన ఆటలు, పాటలతో పాటు శివసత్తుల పూనకాలతో ఊరేగింపు జరిగింది. గురువారం జరిగిన వేడుకలకు నార్సింగి పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆయా సెక్టార్లను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.


శివసత్తులతో ఊరేగింపుగా తరలివెళ్తున్న బోనాలు, భక్తులు


ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

## 30న చలో అసెంబ్లీకి తరలిరావాలి

హిమాయత్‌నగర్, జూలై 25: మున్సిపల్ రంగంలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జరిగే చలో అసెంబ్లీకి కార్మికులు తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ, నగర కార్యదర్శి కమతం యాదగిరి, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యేసురత్నం పిలుపు నిచ్చారు. గురువారం లిబర్టీలోని జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో యూనియన్ నాయకులు కుమార్, యాదయ్య, పి.వెంకటయ్య, జైపాల్‌రెడ్డి, బి.కిషన్, లడ్డులాల్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాక్సినేషన్..

జూబ్లీహిల్స్, జూలై 25: మెదడు వాపు వ్యాధి నివారణకు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో జపనీస్ ఎన్సెఫలైటిస్ వ్యాక్సినేషన్ చేపట్టారు. అంగన్‌వాడీ చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు జేఈ వ్యాక్సినేషన్ చేపట్టారు. 100 శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా ఆగస్టు 15 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బంజారాహిల్స్ గటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జేఈ వ్యాక్సినేషన్ చేపట్టారు. బంజారాహిల్స్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగకార్తీక్, డిప్యూటీ ఐఓఎస్, పాఠశాల హెచ్‌ఎం యాదగిరి పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

హిమాయత్‌నగర్, జూలై 25: రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్యనాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసీ, గిరిజనులకు జనాభా నిష్పత్తి ప్రకారం రూ.29.119 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.17.05 కోట్లు కేటాయించి కోత విధించారన్నారు. 500 జనాభా కలిగిన తండాల పంచాయతీలకు రెవెన్యూ హోదా కల్పించే అంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన ప్రసంగంలో ప్రస్తావించలేదన్నారు. తండా పంచాయతీకి కోటి చొప్పున కేటాయించి, తండాల రెవెన్యూ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ, గిరిజనులకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వారి సంక్షేమానికే ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### బడ్జెట్‌లో రంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం

శంషాబాద్ రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో రంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విమర్శించారు. అన్యాయంపై గురువారం శంషాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్రానికి ఆదాయంలో తలమానికంగా ఉన్న రంగారెడ్డికి కాకుండా తన సొంత నియోజకవర్గానికి రూ.4వేల కోట్లు కేటాయించడం గమనార్హమని అన్నారు. బడ్జెట్‌లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పేరును మారిచిపోయారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు నందకిషోర్, ప్రశాంత్, వడ్డె చంద్రయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు కృషి చేయాలి: మేయర్

సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ )/జూబ్లీహిల్స్: డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. డెంగ్యూ నివారణలో భాగంగా వలంటీర్‌గా గుర్తించిన విద్యార్థులకు ఫిల్మ్ క్లబ్ వెంకటేశ్వరకాలనీలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. వలంటీర్లు తమ కాలనీల్లో డెంగ్యూ రాకుండా పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ఇంటిలో పురాతన కూలర్లు, మొక్కల కుండీలో నీరు నిల్వకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించే విధంగా కాలనీవాసులకు చెప్పాలని పేర్కొనా్రను. కార్యక్రమంలో చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు ప్రదర్శన ద్వారా వలంటీర్లకు వివరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, జూలై 25: నాలాలో పడి గుర్తుతెలియిన వ్యక్తి మృతి చెందిన్నట్టు శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని ఇంద్రనగర్‌దొడ్డి నాలలో వ్యక్తి పడిఉన్నట్లు సమాచారంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటికి తీశారు. చేపలకు వెళ్లి మృతి చెందిన్నట్టు గుర్తించారు. మృతుడు 40 నుంచి 45 ఏండ్లు ఉంటాడని వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### తక్కువ ధరకే బంగారం అంటూ టోకరా

ఖైరతాబాద్, జూలై 25: బంగారంపై పెట్టుబడి పెడితే తక్కువ ధరకే ఇస్తామంటూ పలువురిని మోసగించిన నిందితులను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్, చింతకుంటకు చెందిన ఆకుల వినయ్ (25), బేగంపేట, రసూల్‌పురాకు చెందిన సత్కురి విశాల్ రాజ్ (29), అఖిల్ అనే మరో యువకుడితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. పరిచయమున్న పలువురికి స్కీమ్‌లో పెట్టుబడి పెట్టాలని, తక్కువ ధరకే ఇస్తామంటూ నమ్మబలికారు. కొందరికి ఇచ్చి మరింత పెట్టుబడులు పెట్టించి ఉడాయించారు. రూ.8 లక్షలకు పైగా డబ్బులు దండుకున్నారు. నిందితులు పంజాగుట్ట పీఎస్ పరిధిలో లావాదేవీలు జరిపారు. బాధితుడు ఎర్రంశెట్టి ఉపేందర్ ఫిర్యాదుతో పోలీసులు వినయ్, విశాల్‌రాజ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

### బోరబండ జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఎర్రగడ్డ, జూలై 25: బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం జరుగనున్న బోనాల సందర్భంగా సుందరంగా తీర్చిదిద్దారు. బోరబండ బస్ టెర్మినల్ వద్ద ఏర్పాట్లు చేశారు. డివిజన్ నలుమూలల నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా రావటం ఆనవాయితీ. రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.రవిందర్ తెలిపారు. రవిందర్‌తో పాటు వినాయక రావునగర్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, బస్తీ నాయకులు జి.లక్ష్మణ్‌గౌడ్, రమేశ్‌యాదవ్, ఆనంద్, ముక్కా నర్సింగ్, శంకర్ పరిశీలించారు.